ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల

జిల్లా వార్తలు

5

ఆదివారం 21 జూలై 2024

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- భయాందోళనలో లోతట్టు ప్రాంతాల ప్రజలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- సింగరేణి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



ఉధృతంగా ప్రవహిస్తున్న కత్తెరసాల వాగు

స్తంభించిన జన జీవనం

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది... వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి... పలుచోట్ల రహదారులపై ఉన్న కల్వర్టులు తెగిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది... ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది... ఓసీపీల్లో ఉత్పత్తి నిలిచిపోయింది... దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంచిర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్ర వారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తు న్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నా యి. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహి స్తు న్నాయి. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగులోకి వరద నీరు చేరు తుండటంతో లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్‌నగర్, ఎల్ ఐసీ కాలనీ, పద్మశాలివాడల ప్రజలు ఒకింత భయాందో ళనకు గురవుతున్నారు. యేటా వర్షాకాలంలో రాళ్లవాగు ఉప్పొంగినప్పుడల్లా ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల లోకి నీరు చేరుతోంది. గత అనుభవాలతో ప్రజలు ఆం దోళన చెందు తున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న ట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాం తాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ప్రమాదం పొంచి ఉండటంతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించామని, వరద పరిస్థితులతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేం దుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సహా యం కోసం ప్రజలు 08736-250501, 250502 నెంబర్లలో సంప్రదిస్తే తక్షణమే స్పందించనున్నట్లు తెలిపారు.

అత్యవసరమైతేనే బయటికి రావాలి....

వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్య వసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని రామగుం డం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సహాయం పొందాలని సూచించారు. అలాగే ప్రజల భద్రత, ప్రాణ రక్షణను దృష్టిలో పెట్టుకొని డ్యాంలు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశామని, సాధారణ పరిస్థితి వచ్చేంత వరకు ఎవరూ అటువైపు వెళ్లకూడదని సూచించారు.

జిల్లాలో 14.83 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 14.83 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జైపూర్ మండలం లో 33.5 మిల్లీమీటర్లు, కోటపల్లి మండలం దేవులవాడలో 30.8, జైపూర్ మండ లం కుందారంలో 25.0, కోటపల్లి 24.5, చెన్నూరు 24.3, భీమారం 22.5, కాసిపేట 22.3, కన్నె పల్లి మండలంలో 21.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఎల్లంపల్లిలోకి కొనసాగుతున్న వరద

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హాజీపూర్ మండలంలోని గుడిపేట సమీపంలోగల ఎల్లం పల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 140.84 మీటర్ల ఎత్తు వరకు నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను సాయంత్రం 6 గం టల వరకు 5.884 టీఎంసీల నీరు చేరింది. ఎగువ నుంచి 8942 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుండగా హైద్రాబాద్‌లోని మెట్రోపాలిటన్ వాటర్ స్కీం కోసం 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

చెన్నూరు: భారీ వర్షాల నేపథ్యంలో చెన్నూరు మున్సి పల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఆస్నాద్ రోడ్డులో గల అయాన్ బార్ వద్ద నీరు నిలిచి ఇండ్లలోకి చేరుతుండడంతో రెస్క్యూటీం ఎక్స్ కావేటర్ సహాయంతో నీటిని తొలగించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున ఏమైనా సమస్య లుంటే హెల్ప్ డెస్క్ 8660291492, 9347302179 సంప్రదించాలన్నారు.



ఓసీపీల్లో నిలిచిన ఉత్పత్తి....

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివి జన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులు నిలిచి పోయాయి. క్వారీల్లో నీరు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదు. భారీ వాహనాలు బురదలో కూరుకుపోయే అవకా శం ఉండటంతో ఒడ్డుపై నిలిపి ఉంచారు. మూడు ఏరియాల్లోని ఇందారం, రామ కృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీ ల్లో దాదాపు రూ.19.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తితో పాటు, రూ.6 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికి తీత పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

తెగిన కల్వర్టుతో రాకపోకలకు ఇబ్బందులు

భీమారం: మండలంలోని ఖాజీపల్లి సమీపంలోని చిన్న వాగు కల్వర్టు తెగిపోవడంతో ఖాజీపల్లి, కొత్తూ రు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడు తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాంపూర్, ధర్మారం పెద్దవాగు ఉప్పొంగి చిన్నవాగు లోకి వరద పోటెత్తడంతో కల్వర్టు తెగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో రాకపోకలకు ఇబ్బం దులు పడుతున్నామన్నారు. గత సంవత్సరం కల్వర్టు తెగిపోవడంతో తాత్కాలికంగా పైపులు వేసి కల్వర్టు నిర్మించారని, మళ్లీ ఇప్పుడు వర్షాలకు కల్వర్టు తెగి పోయిందన్నారు. వెంటనే శాశ్వత నిర్మాణం చేపట్టాల ని ప్రజలు కోరుతున్నారు.

ఉప్పొంగిన ఎర్రవాగు

ఐదు గ్రామాల రాకపోకలకు అంతరాయం

నెన్నెల: మండలంలో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండల కేంద్రానికి సమీపం లోని ఎర్రవాగు ఉప్పొంగి కాజ్‌వే పై నుంచి ప్రవహి స్తోంది. కాజ్‌వేకు ఇరువైపుల రోడ్డుపైన బీటీ లేచిపోయిం ది. లంబాడితాండ, మన్నెగూడం, జంగాల్‌పేట, కోనంపేట, కుర్మగూడం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంఆర్ఐ గణేష్, పోలీసు లు ఎర్రవాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. కాజ్‌వేపై నుంచి వాగు ప్రవహిస్తుండ టంతో దాటేం దుకు ప్రయత్నిస్తే ప్రమాదమని పేర్కొన్నారు. ప్రవాహ ఉధృతి తగ్గే వరకు వాగు దాటవద్దని సూచిం చారు. భారీ వర్షాల దృష్ట్యా తహ సీల్దార్ రమేష్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండలం లోని పరిస్థితిని సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతా ధికారులకు సమాచారం అందజేస్తున్నారు.

నీట మునిగిన పంటలు

చెన్నూరు: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించి పో యింది. వందలాది ఎకరాల్లో పంటలు నీట మునగడంతో రైతు లు తీవ్రంగా నష్టపోయారు. మం డలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కెపల్లి లోలెవెల్ కాజ్‌వే ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని కత్తెరసాల, బుద్దారం, సంకారం, సుబ్బరాంపల్లి,బతుకమ్మ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షం మూలంగా పట్టణ, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచిస్తున్నారు. ఎర్రగుంటపల్లెలో బొడ్డు గౌరక్క, నల్ల రమేష్‌లకు చెందిన ఇంటి గోడలు కూలిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు.

పొంగిపొర్లుతున్న వాగులు

కోటపల్లి: మండలంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో పలు వాగులు పొంగిపొర్లాయి. లింగన్నపేట- ఏదుల బంధం గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురి కావడంతో పది గ్రామా లకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. ఇక్కడ తుంతుంగ వాగు ఉధృతితో అన్నారం వైపు వెళ్లే రవాణా నిలిచి పోయింది. నక్కలపల్లి రహదారిలో లోత్‌రై, బ్రహ్మణపల్లి వాగులు పొంగడంతో అటు వైపు ఐదు గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. మరో వైపు కొండంపేట గ్రామంలో భారీ వర్షాలకు కుర్మ మల్లయ్య ఇంటి గోడ కూలి పోయింది. పొలాలు వరదలతో చెరువులను తలపిస్తుండగా మండలానికి సరిహద్దుగా ఉన్న గోదావరి, ప్రాణహిత నదులు పొంగి పొర్లుతున్నాయి. నదుల ప్రవాహం తీవ్రంగా ఉండడంతో ఎప్పుడు ఏ ముప్పు సంభ విస్తుందోనని లోతట్టు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేమనపల్లి: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. మండలంలోని చామనపల్లి వాగుతోపాటు ఒర్రెలు పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. చామనపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుం డడంతో గ్రామస్థులు నీల్వాయి, వేమనపల్లి గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొం ది. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. నీల్వాయి ప్రాజెక్టు నిండ కుండ లా మారింది. ప్రాజెక్టులోకి వరద నీరు అధికంగా వచ్చి చేరుతుం డడం తో మత్తడి దూకుతోంది. ప్రాజెక్టు కెపాసిటీ 0.846 టీఎంసీలు కాగా, ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 110 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో 75 క్యూసెక్కులు ఉంది.

జైపూర్: మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లలేదు.

నస్పూర్: నస్పూర్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం పడు తోంది. నస్పూర్ మండలంలో 10.03 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వలన వర్షం పడుతున్నందున డ్రైనేజీలు వాన నీటితో ప్రవహిస్తున్నాయి. రహదారులపై వర్షపు నీరు చేరింది. మట్టి రోడ్లన్నీ బురదతో చిత్తడిగా మారాయి, ఉద యం నుంచి వర్షం పడుతున్నం దున జన జీవనం స్తం భించిపోయింది. రోజు వారి కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కాసిపేట: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించి పోయింది. మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. చెరు వులు, వాగులు నీటితో నిండిపోయా యి. కురిసిన వర్షాల తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందమర్రిరూరల్: మండలంలో ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించి పోయింది. రోడ్లపై అమ్మే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామా ల్లోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వాగులో అదుపు తప్పిన బైక్..



బైక్‌ను బయటకు తీసుకువస్తున్న స్థానికులు

కోటపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామ సమీ పంలోని మత్తడి వాగు ప్రవాహంలో శనివారం ఓ ద్విచక్ర వాహనదారుడు వరద ప్రవాహంలో చిక్కుకోగా స్థానికులు కాపాడారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన వేముగంటి అనిల్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం చెన్నూరుకు వెళ్లేందుకు బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో బ్రహ్మణపల్లి వద్ద మత్తడి వాగు ప్రవాహం లోలెవెల్ వంతెనపై నుంచి పారు తుండగా ద్వి చక్ర వాహనదారుడు ముందుకు వెళ్ల డంతో వరదకు ఒక్కసారిగా బైక్ అదుపు తప్పింది. దీంతో వాహన దారుడు వెంటనే బైక్ వదిలేసి ముందుకు వెళ్లాడు. బైక్ నీళ్లలో కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు తాడు సహాయంతో బైక్‌ను బయటకు తీశారు.



ఎర్రగుంటపల్లెలో కూలిన నల్ల రమేష్ ఇంటి గోడలు



ఖాజీపల్లిలో తెగిన కల్వర్టు



ఎర్రవాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నిండకుండలా మారిన నీల్వాయి ప్రాజెక్టు

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన ఎమ్మెల్యే



కేశవరావుతో ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

బెల్లంపల్లి, జూలై 20: హైద్రాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో ప్రభుత్వ సలహాదారుడు కేశవరావును బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి శనివారం కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకు రావడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనను కోరారు.

ఆర్ఎంపీల హర్షం

జన్నారం, జూలై 20: ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పం దించడం హర్షణీయమని సంఘం జిల్లా అధ్యక్షుడు బెంజి మెన్, జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శనివారం జన్నారంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేయాలని కోరారు. గ్రామీణ పేదలకు తాము మెరు గైన వైద్యం అందిస్తున్నామన్నారు. తమను గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో మూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు నీటి విడుదలకు ఎమ్మెల్యేల కృషి



లక్షెట్టిపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లక్షెట్టిపేటరూరల్, జూలై 20: కడెం ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు సాగునీటి విడుదలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, వెడ్మ బొజ్జులు కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్ళుగా వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతుకు నోచుకోలేదని, దీంతో మంచిర్యాల, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జులు ప్రభుత్వంను ఒప్పించి రూ.9.26 కోట్లతో మరమ్మతు చేయించారన్నారు. ఎగువ కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో నీటిమట్టం పెరిగిందన్నారు. చింత అశోక్‌కుమార్, నలిమెల రాజు, రమేష్, తిరుపతి, శ్రీనివాస్, వెంకటేష్, సయ్యద్ ఆలీ, సత్తయ్య, రవీందర్, చిన్నన్న, పాల్గొన్నారు.

హాజీపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక పథకాలను అందిస్తూ అభ్యున్నతికి తోడ్పడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీటితో మంచిర్యాల నియోజకవర్గంలోని మూడు మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులకు రుణమాఫీ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శ్రీనివాసరావు, ఒడ్డె శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, బాపు, బాలరాజు, శంకర్, జితేందర్‌రావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కడెం ఆయకట్టుకు నీరు విడుదల

దండేపల్లి: కడెం ప్రాజెక్టు నుంచి వానాకాలం సాగు కోసం కుడి, ఎడుమ ఆయకట్టు కాలువలకు సాగు నీటిని ఆదివారం విడుదల చేయనున్నట్లు కడెం ప్రాజెక్టు ఈఈ రాథోడ్ విట్టల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఖనాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో, ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తి గోదావరి నదికి వదిలే అవకాశం ఉందన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

బెల్లంపల్లి, జూలై 20: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ నాయకులు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు నెల్లి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు 48 లక్షల మంది ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. హామీని నెరవేర్చాలన్నారు. శ్రీధర్, కొమురయ్య, రమేష్, మహేష్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

సిడాం శంభు వర్ధంతి

కాసిపేట, జూలై 20:ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన సిడాం శంభుపటేల్ వర్ధంతిని శనివారం దేవాపూర్‌లో ఆదివాసీ సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్ముల బాపు, ఆడె జంగు, శ్రీనివాస్, ప్రభాకర్, ఆత్రం జంగు, భీంరావు, రెడ్డి లక్ష్మణ్,అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : యువకుడి మృతి


రాజేందర్ (ఫైల్)

దండేపల్లి, జూలై 20: దండేపల్లి మండలం కన్నెపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన వోల్లాల రాజేందర్(39) గూడెం షిర్డీ సాయిబాబా ఆలయంలో కుటుంబ సమేతంగా పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి పుల్లూరి నరేష్‌తో కలిసి బైక్‌పై లక్షెట్టిపేట వెళ్లారు. తిరిగి గూడెం ఆలయం వైపునకు వస్తుండగా గూడెం నుంచి లక్షెట్టిపేట కరీంనగర్ చౌరస్తా వైపునకు వేగంగా వచ్చిన బైక్ ఎదురుగా వస్తున్న రాజేందర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేందర్ రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య వొల్లాల శారద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి


రమేష్ (ఫైల్)

జైపూర్, జూలై 20: ఇందారం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మిట్టపల్లి రమేష్ (50) శనివారం హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. రమేష్ మృతి బాధాకరమని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

కన్నెపల్లి, జూలై 20 : కొత్తపల్లి గ్రామానికి చెందిన గట్టు రాజయ్య (50) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజయ్యకు పిల్లలు లేకపోవడంతో తరుచూ బాధపడుతుండేవాడు. మద్యానికి బానిసయ్యాడు. గురువారం గ్రామంలోని ఓ ఇంట్లో పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్న రాజయ్యను చూసిన పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

రైళ్లలో గంజాయి రవాణాను అడ్డుకుంటాం


బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వే స్టేషన్లలో తనిఖీలు

బెల్లంపల్లి, జూలై 20: రైళ్ల ద్వారా వచ్చే గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుంటామని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్ఐలు రమేష్, నరేష్‌కుమార్‌లు పేర్కొన్నారు. శనివారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో నార్కోటిక్ ట్రైనింగ్ స్నిపర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. రైళ్లు, స్టేషన్ పరిసరాలు, అనుమానాస్పద వస్తువులను తనిఖీలు చేశారు. పలువురు ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసి వివరాలను తెలుసుకున్నారు. పార్శిల్ ఆఫీస్ ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి నిర్మూలించేందుకు నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో భాగంగానే రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి రైళ్లలో తీసుకువచ్చి విక్రయిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్‌పీ సిబ్బంది, స్పెషల్ పార్టీ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఏసీసీ: గంజాయి అక్రమ రవాణా నియంత్రణ చర్యల్లో భాగంగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్ ట్రైనింగ్ స్నిపర్ డాగ్, స్పెషల్‌పార్టీ బృందాలతో తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్శిల్ సర్వీసు కేంద్రం, రైల్వే బోగీలు, ప్రజల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలకు పాల్పడిన వారి అరెస్టు


నిందితులను చూపుతున్న డీసీపీ భాస్కర్

ఏసీసీ, జూలై 20: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మంథని జగన్‌మోహన్‌రావులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఈ నెల 2న మంచిర్యాల మార్కెట్ ఏరియాలో చేతితో రాసిన పత్రాలను రాత్రిపూట మూసి ఉన్న దుకాణాల్లో వేసిన కేసులో నిందితులను అరెస్టు చేశారు. శనివారం ఏసీపీ కార్యాలయంలో డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4న జగన్‌మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలను పరిశీలించగా ఈ నెల 2న మూసి ఉన్న షాపుల్లో పత్రాలను వేయడం గమనించామన్నారు. వ్యక్తి ధరించిన దుస్తులు, గొడుగు ఆధారంగా పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి రజనీష్‌జైన్‌ను నిందితుడిగా గుర్తించామన్నారు. శనివారం అతడిని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని మోటార్ సైకిల్, సెల్‌ఫోన్, ఆ రోజు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కుట్రలో మరో ఇద్దరు పాల్గొన్నట్లు విచారణలో తేలిందన్నారు. పాత మంచిర్యాలకు చెందిన కొల్లూరి భాస్కర్, సీసీసీ నస్పూర్‌కు చెందిన ఎరకొండ్ల సంపత్‌ను అరెస్టు చేశామన్నారు. రజనీష్‌జైన్, కొల్లూరి భాస్కర్‌లపై రెండు భూకబ్జా కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సంపత్ చేతి రాత పేపరును స్వాధీన పర్చుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఏసీపీ ప్రకాష్, పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ ప్రశాంత్ పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్యకు కారణమైన ముగ్గురి రిమాండ్

లక్షెట్టిపేటరూరల్, జూలై 20: లక్షెట్టిపేట పాతబస్టాండ్ సమీపంలో ఈ నెల17న ఆత్మహత్యకు పాల్పడిన వ్యాపారి ప్రతాప్‌సింగ్ మృతికికారణమైన ముగ్గురు నిందితులపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతుడికి అధికడబ్బులు వడ్డీకి ఇవ్వడంతోపాటు జూదం ఆడించి డబ్బులు కాజేశారన్నారు. వారానికి రూ.10వేలు వడ్డీ తీసుకుని ఇంకాడబ్బులు కావాలని ఇబ్బందులకు గురిచేసి మరణానికి కారణమయ్యారన్నారు. మృతుడు సూసైడ్‌నోట్ ఆధారంగా విచారణచేపట్టి గోదావరి రోడ్డుకు చెందిన మహమ్మద్ కలీం, ఇటిక్యాలకు చెందిన పెట్టెం తిరుపతిస్వామి, గంపలపల్లికి చెందిన ఎగ్గడిజగ్గన్నను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న న్యాయం చేయాలి

కన్నెపల్లి, జూలై 20: జన్కాపూర్‌కు చెందిన శీలం పోచయ్య న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు. పోచయ్య అన్న కుమారుడు శ్రీనివాస్ 3 ఎకరాల భూమిని దొంగతనంగా పట్టా చేయించుకున్నాడని వాపోయాడు. శ్రీనివాస్ మంచిర్యాల పంచాయతీరాజ్ కార్యాలయంలో పనిచేస్తున్నాడని తెలిపారు. విషయం తెలిసినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ చావు బతుకుల మధ్య మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని పేర్కొన్నాడు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకోమని వైద్యులు చెప్పారన్నారు. నాకు ఏదైన జరిగితే శ్రీనివాస్ బాధ్యుడని తెలిపాడు. కలెక్టర్, పోలీసులు ఇదే నామరణ వాంగ్మూలంగా స్వీకరించి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

మద్యం మత్తులో హోంగార్డు పై దాడి

భీమిని, జూలై 20 : మద్యం మత్తులో ఓ యువకుడు హోంగార్డు పై దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ఎస్సీ కాల నీకి చెందిన రాంటెంకి శ్రీకాంత్ సైకోగా మారి పలువురిని గాయపరి చారని 100కు ఫిర్యాదు వచ్చింది. పోలీస్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడిన రాం టెంకి శంకర్‌తోపాటు తనకు తాను గాయపర్చుకున్న శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో హోంగార్డు అశోక్‌ను ఎస్కార్ట్‌గా పంపించారు. బెల్లం పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో శ్రీకాంత్ హోంగార్డు అశోక్‌పై పదునైన ఆయుధంతో గొంతుపై గాయపర్చాడు. అశోక్‌తోపాటూ నిందితుడు శ్రీకాంత్‌ను ఆసుపత్రికి తరలించారు. హోంగార్డు ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

పారిశుధ్య లోపంతో ఇబ్బందులు

రామకృష్ణాపూర్, జూలై 20 : పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతే అన్నారు. శనివారం రామకృష్ణాపూర్‌లో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్వరాల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని, పేద, మధ్య తరగతి ప్రజలు అప్పుల పాలవుతున్నారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. మోతే రవికుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ


ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీడీ రమాదేవి

కెరమెరి, జూలై 20: రాంజీగూడ ఆశ్రమ పాఠశాలను శనివారం డీడీ రమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. అనంతరం కల్లెగాం, అంబారావుగూడ, టీడబ్ల్యూపీఎస్‌లను తనిఖీ చేశారు.

గుంతలను పూడ్చండి మహాప్రభో..


ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జైనూర్, జూలై 20: ఆసిఫాబాద్ నుంచి జైనూరు మీదుగా ఆదిలాబాద్ వరకు రాకపోకలు చేసే ప్రధాన రోడ్డుపై ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో మురికి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మండలంలోని కాలేజీగూడ, పవర్‌గూడలో ఏర్పడిన మురికి నీటి గుంతల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై నుంచి జిల్లా అధికారులు, ఎమ్మెల్యే, మంత్రులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ రోడ్డును బాగు చేయడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతల్ని పూడ్చివేయాలని మండలవాసులు కోరుతున్నారు.

అర్హులైన రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి,జూలై 20: దరణి పట్టాదార్ పాసుబుక్ కలిగియున్న రైతులు రైతు బీమా పథకానికి ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గొర్ల అంజిత్‌కుమార్ శనివారం ఓప్రకటనలో కోరారు.గత నెల జూన్ 28 వరకు కొత్తగా పట్టా పాసుబుక్ పొందిన రైతులతో పాటు గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులందరు స్థానిక వ్యవసాయం కార్యలయం, ఆయా కస్టర్లు పరిదిలోని రైతు వేదికలో ఏఈవోలకు దరఖాస్తు ఫారాలు నింపి అందజేయాలన్నారు. రైతు బీమా పథకానికి పట్టాదారలు 14-08-1965 నుంచి14-08-2008 మధ్య జన్మించి ఉండాలన్నారు. గత సంవత్సరం రైతు బీమా పాలసీ ఉన్నవారు వ్యవసాయ శాఖచే రెన్యువల్ చేసుకోవాలన్నారు. రైతు బీమా పథకం కోసం రైతు పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాత బుక్ జిరాక్స్ కాపిలతో రైతు బీమా ఫారంకు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

భూముల నష్టపరిహారం పెంచాలి



కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితులు

నస్పూర్, జూలై 20: జైపూర్-వరంగల్-విజయవాడ నేషనల్ గ్రీన్‌హైవే నిర్మాణంతో ముంపునకు గురవుతున్న భూములకు నష్టపరిహారం పెంచాలని శనివారం బాధితులు కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి విన్నవించారు. న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ జైపూర్ సింగరేణి ఓపెన్‌కాస్టులోఎకరానికి రూ.24.06 లక్షల నష్టపరిహారం ఇచ్చారన్నారు. హైవేలో ముంపునకు గురయ్యే భూములకు ఎకరానికి ఎనిమిది లక్షలు ప్రకటించడం అన్యాయమన్నారు. ఎకరానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని విన్నవించినట్లు బాధితులు తెలిపారు. భూ నిర్వాసితులు సుందిళ్ళ మల్లేష్, జనార్దన్‌రెడ్డి, బల్ల మొగిలి, తిరుపతి, రామారావు, ఇప్పలపల్లిబాపు, శంకర్, చంద్రయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

బెల్లంపల్లి, జూలై 20: మండలంలోని కన్నాల పంచాయతీ పరిధిలోని ఆర్‌పీ గార్డెన్‌లో తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి వెంకటస్వామి ప్రారంభించారు. పోటీలకు 10 జిల్లాల నుంచి వివిధ విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో క్రీడాకా రులు తలపడ్డారన్నారు. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 31 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బడీడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి

జైపూర్, జూలై 20: బడీడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూపర్‌వైజర్ కవిత పేర్కొన్నారు. అమ్మ మాట-అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు, గర్భిణీలకు, పిల్లలకు పౌష్టికాహారం, ఆటాపాటల ద్వారా విద్య నేర్పిస్తామన్నారు. టీచర్ అరిగెల కళ్యాణి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

భీమారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, ఎంపీడీవో రాథోడ్ రాధ, జిల్లా కోఆర్డినేటర్ సంతోష్‌లు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో విద్య నేర్పిస్తామన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలందర్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశం

నస్పూర్, జూలై 20: తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(పీటీఎం) శనివారం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు రామన్న తల్లిదండ్రులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటి వద్ద ఎక్కువ సమయం చదువుకునే విధంగా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు.

కాసిపేట: పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ముత్యంపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్ప అన్నారు. అమ్మఆదర్శ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు, టీవీలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు బండ శాంకరి, కమిటీ చైర్మన్ భారతి, జ్యోతి, మాధవీలత, పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థినికి నోటు బుక్కులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 20: వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూప్రకారం పోషక ఆహారం అందించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్‌కులాల బాలికల వసతిగృహాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహం ఆవరణ, విద్యార్థుల గదులు, పరిసరాలు, మూత్రశాలలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ఉదయం అందించే అల్పాహారంపై విద్యార్థులను అడుగగా ఇడ్లీ, పులిహోర, టమాట రైస్ ఇస్తున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు, సంక్షేమాధికారి, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన గురు పౌర్ణమి వేడుకలు



పూలాజీబాబా సమాధి మందిరంలో పూజలు చేస్తున్న ఇంగ్లే కేశవ్‌రావ్ దపంతులు

జైనూర్, జూలై 20: మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో శుక్రవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం కాగా శనివారం సంస్థాన్‌లో పూలాజీబాబా తనయుడు, సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్‌రావ్ దపంతులు, బాబా సతీమణి ద్రుపదబాయి తదితరులు జెండాను ఆవిష్కరించారు. బాబా సమాధి మందిరంలో పూజలు నిర్వహించారు. ధ్యానమందిరంలో పులువురు బాబా సూచించిన మార్గంపై ఉపన్యసించారు. ఏఎస్ఐ ముండే ఉద్ధవ్ పోలీసులతో బందో స్త్ ఏర్పాటు చేశారు. వేడుకలకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తుల కోసం సిద్ధేశ్వర్ సంస్థాన్ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వామన్‌రావ్ ఇంగ్లే, ప్రధాన కార్యదర్శి దుర్రె సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నస్పూర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్, చెన్నూరు ఇసుక రీచ్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్

నస్పూర్, జూలై 20: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ, జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. ఒకవైపు జోరుగా వాన కురుస్తున్నా గొడుగులు పట్టుకుని మొక్కలు నాటే కార్యక్రమంలో అధికార యంత్రాంగం పాల్గొంది. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెంచడం వలన భావితరాలకు సమతుల్య వాతావరణం అందించవచ్చన్నారు. వన మహోత్సవంలో వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్‌డీవో రాములు, గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీపీవో వెంకటేశ్వర్ రావు, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, తహసీల్దార్లు శ్రీనివాస్, రమేష్, మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీష్, కౌన్సిలర్లు అగల్‌డ్యూటీ రాజు, చంద్రశేఖర్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

చెన్నూరు: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. చెన్నూరు మండల కేంద్రంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసిందన్నారు.

ప్రజలకు అందుబాటులో ధరలో ఇసుకను అందిస్తోందన్నారు. ఇసుక రీచ్‌ల ద్వారా అధికారికంగా ఇంటి వద్దకే ఇసుకను పొందవచ్చని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు.

బాలికల సమస్యల పరిష్కారానికే చైల్డ్ హెల్ప్‌లైన్



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

జైపూర్, జూలై 20: బాల బాలికల సమస్యల పరిష్కారానికే చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) పనిచేస్తుందని జిల్లా మహిళ సాధికారత కోఆర్డినేటర్ సౌజన్య పేర్కొన్నారు. శనివారం మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా జిల్లా కేంద్రంలోని బాల రక్ష భవన్‌ను సంప్రదించాలన్నారు. పిల్లలు ఉన్నత విద్యనభ్యసించేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు ఉపయోగించే విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

బెల్లంపల్లి, జూలై 20 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వరి, పత్తి, కంది, సోయాబీన్ పొలాల్లోని మొక్కల మధ్య నీరు నిలవకుండా చూడాలన్నారు. పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉన్నందున మొక్క వయస్సును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి నాటు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బతింటే పొలాలను దమ్ము చేసి మళ్లీ స్వల్పకాలిక రకాలను ఎంచుకుని నేరుగా విత్తుకోవాలని సూచించారు.

రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

దండేపల్లి, జూలై 20: రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. దండేపల్లి పద్మశాలి భవనంలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతిని సన్మానించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, గృహజ్యోతి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందనడానికి నిదర్శనం తిరుపతి అన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసి పేరు తెచ్చుకోవాలన్నారు. తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో పాటు రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేమ్‌చందు, ప్రవీణరెడ్డి, శ్రీనివాస్, కాంతరావు, నాగరాణిత్రిమూర్తి, తిరుపతి, వెంకటేశ్వర్లు, సతీష్, పాల్గొన్నారు.

317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కోటపల్లి, జూలై 20 : ప్రభుత్వం 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో సభ్యత్వ పక్షోత్సవాలనువిజయవంతం చేయాలన్నారు. ప్రసాద్, కోమట్ల బాపు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మంచిర్యాలలో రెండు రైళ్లు నిలుపుదల

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 20 : నిజాముద్దీన్ -తిరుపతి, ఎర్నాకులం -పాట్నా సూపర్ ఫాస్టు రైళ్లను మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలిపేందుకు రైల్వే అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పలు రైల్వేస్టేషన్‌లలో 69 రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తూ రైల్వే శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రెండు రైళ్లు మంచిర్యాలలో ఆగుతుండడంపై ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ సిబ్బంది బదిలీ

ఏసీసీ, జూలై 20: మున్సిపల్ సిబ్బందిని బదిలీ చేస్తూ శనివారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న రాథోడ్ సునీల్‌కుమార్‌ను రామగుండం కార్పొరేషన్, మాసాడి వైకుంఠంను బెల్లంపల్లి మున్సిపాలిటీకి బదిలీ చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉదయ్‌కిరణ్‌ను మంచిర్యాలకు, మందమర్రి మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్.లలితను మంచిర్యాలకు, మందమర్రి మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న చిట్టిబాబు, ప్రవీణ్‌ను బెల్లంపల్లికి బదిలీ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న లక్ష్మీరాజ్, శ్రీనివాస్‌లను మందమర్రికి, బెల్లంపల్లి సీనియర్ అసిస్టెంట్ రాజేందర్‌ను మందమర్రికి బదిలీ చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్ సర్వర్, మంచిర్యాల మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్ మజహర్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేశారు. మంచిర్యాల శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్యాంసుందర్‌ను మందమర్రికి బదిలీ చేశారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న డీఈవో

హాజీపూర్, జూలై 20: దొనబండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో యాదయ్య సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్య మైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం, విద్యాపరంగా సలహాలు, సూచనలు అందించారు. రీడింగ్ కార్నర్స్ ఏర్పాటు చేసు కోవాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్‌వో చౌదరి, ప్రధానో పాధ్యాయుడు హన్మాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులతో అభివృద్ధి సాధ్యమేనా?

- అదనపు విధులతో కొత్త తలనొప్పులు
- జిల్లా అధికారులకు మండల పాలన అప్పగింత



ప్రత్యేకాధికారులతో సమావేశం(ఫైల్)

ఆసిఫాబాద్ రూరల్, జూలై 20: గ్రామపరిపాలనలో స్థానికసంస్థల ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో ఉంటుంది. రెండునెలల క్రితం గ్రామసర్పంచ్‌ల పదవీకాలం పూర్తికాగా జూలై5న ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తైంది. స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో నవంబరు వరకు ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లాకలెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటికేశాఖల్లో తగిన సిబ్బంది లేక ఆయాశాఖల జిల్లా అధికారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మండలాల ప్రత్యేక అధికారులుగా అదనపుబాధ్యతలు కట్టబెట్టడంతో అభివృద్ధి సాధ్యమవుతుందా అనేది అనుమానం కలిగిస్తోంది.

అధికారులకు ఇబ్బందులు..

ఇప్పటికే శాఖల్లో సరిపడినంత సిబ్బంది లేకపోవడంతో ఆయాశాఖల జిల్లా అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని గతనెలలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో రహదారులు, భవనాల శాఖాధికారులతోపాటు పలుశాఖల అధికారులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తాము ఇలా అయితే పనిచేయలేమంటూ ఆవేదన వెళ్లగక్కారు. తాజాగా మండలాల ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించడంతో కొత్త తలనొప్పి ప్రారంభమైందంటూ పలువురు అధికారులు వాపోతున్నారు.

అధికారులకు మండలాల పాలన..

స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి కావడం, రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కూడా ఇప్పట్లో నిర్వహించడానికి సిద్ధంగా లేకపోవడంతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే మండలాల వారీగా ప్రత్యేకాధికారులను నియమిస్తూ గతవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తుండగా పెద్దమండలాలైన ఆసిఫాబాద్‌కు ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్‌కు అక్కడి ఆర్డీవో సురేష్‌ను ప్రత్యేకాధికారిగా నాయమించారు. మండలాల వారీగా జైనూరుకు గుణవంతరావు(ఇరిగేషన్ ఈఈ), సిర్పూర్(యు)కు భాస్కర్(డీడబ్ల్యూవో), లింగాపూర్‌కు సురేష్‌కుమార్ (జిల్లా వెటర్నరీ అధికారి), తిర్యాణికి రమాదేవి(జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి), రెబ్బెనకు భిక్షపతి(డీపీవో), కెరమెరికి లక్ష్మీనారాయణ(డిప్యూటీ సీఈవో), వాంకిడికి వెంకటపతి(భగీరథ ఈఈ), సిర్పూర్(టి)కి, కౌటాలకు సురేందర్ (డీఆర్డీవో), చింతలమానేపల్లికి శ్రీనివాసరావు(డీఏవో), బెజ్జూరుకు వెంకటేశం (ఉద్యానవన శాఖాధికారి), పెంచికలపేటకు ప్రభాకర్(ఇరిగేషన్‌ఈఈ), దహెగాంకు పెద్దన్న(రహదారుల భవనాల శాఖ ఈఈ)ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

సిర్పూర్(యు), జూలై 20: వర్షాకాలంలో వ్యాధులపట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకో వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలని ఆదివాసీమిత్ర వెల్ఫేర్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ ఆడ వెంకటేష్ కోరారు. ఫార్మసిస్ట్ గది వర్షం వచ్చినప్పుడల్లా ఊరుస్తుందని మరమ్మతులు చేయాలని కోరారు.

విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ



చింతలమానేపల్లిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ శంకరమ్మ

చింతలమానేపల్లి, జూలై 20: విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని కర్జవెల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ-1,2కేంద్రాల్లో బడిబాటలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ శంకరమ్మ పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగళ, వీణ, ఆశా కార్యకర్తలు కమల, మంగ, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని అంగన్‌వాడీ-2 సెంటర్‌లో శనివారం చిన్నారులకు బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, అర్చన, ఆయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని దహెగాం-1, బోర్లకుంట అంగన్‌వాడీకేంద్రాల్లో శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు రజిత, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, విజయకుమారి, ఆయాలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్

ఆసిఫాబాద్, జూలై 20: మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ శనివారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు గాదవేణి మల్లేష్, మాజీ జడ్పీటీసీ సంతోష్, దీపక్‌ముండే, అమనూల్ల పర్వేజ్, ప్రతాప్, సోమశేఖర్, బ్రహ్మణ సమాజ్ సభ్యులు ప్రతాప్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్

ఉన్నత పాఠశాలల పని వేళల్లో మార్పు

ఏసీసీ, జూలై 20: ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుంచి ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలకు అనుగుణంగా ఉన్నత పాఠశాలల పనివేళలను కూడా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

దండేపల్లి, జూలై 20: లింగాపూర్ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అనీలాను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి కాసుల రవీందర్ పేర్కొన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం, విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ డబ్బులను సొంతగా వాడుకుందన్నారు. తోటి ఉపాధ్యాయులతో సఖ్యత లేకపోవడం, విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడం, తదితర ఆరోపణలు నేపథ్యంలో ఆమెపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించగా సస్పెండ్ చేశారన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నస్పూర్, జూలై 20 : వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ రాంమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు తడిసి ఉంటాయని, తడి చేతులతో వైర్లను, స్తంభాలను, మోటార్ల స్టార్టర్లను తాకితే షాక్ తగిలే ప్రమాదం ఉంటుందన్నారు. చిన్న పిల్లలు కరెంట్‌కు దూరంగా ఉండే విధంగా జాగ్రత్త పడాలన్నారు. ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరవేయకూడదన్నారు తెగిపడిన విద్యుత్ వైర్లను ముట్టుకూడదన్నారు. సర్వీస్ కేబుల్ అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు.

నేటి నుంచి వర్షవాస్ ప్రారంభం

వాంకిడి, జూలై 20: మండలకేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆదివారం నుంచి మూడునెలల పాటు వర్షవాస్ గ్రంథపఠన కార్యక్రమంనిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్‌దుర్గె తెలిపారు. బుద్ధఅండ్‌ధమ్మ జీవితచరిత్రపై గ్రంథపఠణ నిర్వహిస్తామన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

ఆసిఫాబాద్, జూలై 20: వినియోగదారులకు మరింత చేరువై వారి సమస్యలను త్వరగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు, తిరిగి 3 నుంచి 5గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి, జూలై 20: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈవోఅశోక్ అన్నారు. శనివారం మోడి కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఎంఎన్‌వో ప్రకాష్, ఎస్‌వో మీనాకుమారి, తదతరులు ఉన్నారు.

నేడు మహంకాళి బోనాల జాతర

కాగజ్‌నగర్, జూలై 20: కాగజ్‌నగర్‌పట్టణంలో మహంకాళి బోనాల జాతర ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. లారీ చౌరస్తాలో మధ్యాహ్నం 1గంటనుంచి శోభాయాత్ర ప్రారంభమై సర్‌సిల్క్‌లోని మహంకాళి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. పట్టణ వాసులు తప్పకుండా హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని ఆయన కోరారు.

రుణాల మాఫీపై ఆరా

సిర్పూర్(టి), జూలై 20: ప్రభుత్వం ప్రారంభించిన రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో లక్ష రూపాయల రుణమాఫీ చేయడంపై శనివారం ఏవో మధులత బ్యాంకులలో ఆరా తీశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ఆధార్‌కార్డులు, అకౌంట్లలో తప్పులు ఉన్నట్లయితే బ్యాంకు అధికారులు సరిచేసి మళ్లీ వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారన్నారు. ఈనెల 31 లోగా రైతుబీమాలో నామినిపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కొత్త పాసుపుస్తకం వచ్చిన రైతులు రూ.5లక్షల రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నీరు ఇళ్లలోకి చేరకుండా చర్యలు

చింతలమానేపల్లి, జూలై 20: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చింతలమానేపల్లి మండల కేంద్రంలోని శివాజీచౌరస్తాలో ఇళ్లలోకి నీరు వెళ్లకుండా ఎంపీడీవో ప్రసాద్ శనివారం ఎక్స్‌కావేటర్‌తో కాలువ తవ్వించారు. దీంతో కాలనీవాసులకుఊరట లభించింది.

రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

దహెగాం/బెజ్జూరు, జూలై 20: రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు తమ పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెచ్చులూడిన జీపీ భవనం పైకప్పు

కౌటాల, జూలై 20: మండలంలోని కన్నెపల్లి గ్రామ పంచాయతీ భవనం స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనం తడిసి పైకప్పు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కుమరం భీం జిల్లా వార్తలు
8
ఆదివారం 21 జూలై 2024





బెజ్జూరు సమీపంలో నిత్యావసర సరుకులతో వాగు దాటుతున్న గ్రామస్థులు



దహెగాంలో లో లెవల్ వంతెన పై నుంచి ఉధృతంగా ప్రవాహం

ఎడతెరిపి లేని వర్షం

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- కుమరంభీం ప్రాజెక్టు మూడు గేట్ల ఎత్తివేత
- కాగజ్‌నగర్‌లో తెగిపోయిన జగన్నాథ్‌పూర్ వంతెన అప్రోచ్ రోడ్
- 50 గ్రామాలకు నిలిచి రాకపోకలు
- వంజీరి అండర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే హరీష్‌బాబు

జిల్లాల్లో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలిన ఆదేశాలు జారీ చేశారు. ఎవరూ కూడా ప్రవహిస్తున్న వాగులను, వంతెనలను దాటవద్దని అధికారులు సూచించారు. వరదలకు కొన్ని ప్రాంతాల్లో పంట చేలు మునిగిపోయాయి. పలువురి ఇళ్లు నేలమట్టమయ్యాయి.

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 20: జిల్లాలో శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మండలంలోని గుండివాగు, అప్పపెల్లివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయాగ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు, వట్టివాగు ప్రాజెక్టులలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. కుమరంభీం ప్రాజెక్టులోకి 1778క్యూ సెక్కుల వరదనీరు వచ్చిచేరడంతో మూడుగేట్లు పైకిఎత్తి 1941క్యూసెక్కుల వరదనీటిని అధికారులు కిందికి వదులుతున్నారు. పెద్దవాగునది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపలవేటకు వెల్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. వరద ఉధృతికి వాగుదాటవద్దని గుండి గ్రామంలో పంచాయతీ అధికారులు డప్పు చాటింపు చేశారు. మండలంలోని గూడెన్‌ఘాట్ లోలెవల్ వంతెనను కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్య పరిశీలించి అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని లోలెవల్ వంతెనలు, వాగుల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. కుమరంభీం ప్రాజెక్టును ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పరిశీలించి వరద ఉధృతిని ఇంజనీరింగ్ అధికారులనుఅడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం 19.6మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. అత్యధికంగా సిర్పూర్ (యు)లో 40.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా జైనూర్‌లో 6.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కంట్రోల్ రూం ఏర్పాటు..

ఆసిఫాబాద్: వర్షాల కారణంగా ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసికంట్రోల్‌రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారయంత్రాంగం ఎళ్లవేళలా అప్రమత్తంగా ఉంటూ పనిచేస్తుందన్నారు. వర్షాల కారణంగా విద్యుత్‌సరఫరాలో అంతరాయం, వరద పరిస్థితులు, ఇతర సమస్యలపై ప్రజలు కంట్రోల్‌రూం సహాయం పొందవచ్చన్నారు. జిల్లాలో నదులు,వాగులుఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అటువైపుగా వెళ్లకుండా సంబంధితశాఖల సమన్వయంతో రక్షణచర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందిని వాగులు, వంతెనలు కాజ్‌వేల వద్ద పహారా ఉంచామని తెలిపారు. కంట్రోల్‌రూంలో సిబ్బంది 24గంటలు విధులు నిర్వహిస్తారని తెలిపారు. రైతు రుణమాఫీ, విపత్తు నిర్వహణ సంబంధిత సహాయం కోసం ఫోన్‌నెం08733-279033, 6304686505ను సంప్రదించాలన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌లో జగన్నాథ్‌పూర్ బ్రిడ్జి వద్ద పదిహేనురోజుల క్రితం వేసిన అప్రోచ్‌రోడ్డు శనివారం కురిసిన ఎడతెరిపి లేని వర్షానికి కొట్టుకు పోయింది. దీంతో కాగజ్‌నగర్, దహెగాం, భీమిని మండలాలకు, 50గ్రామాలకు రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవాగులో నీటిమట్టం పెరిగింది. వంజీరి అండర్‌బ్రిడ్జిని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సందర్శించారు. మోటార్ల సహాయంతో నీటిని తొలగించాలని రైల్వే అధికారులకు సూచించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. బురదగూడ రిజర్వాయర్‌కు గండిపడి నీరంతా సమీపపొలాల్లో వెళ్లడంతో ఇసుక మేటలు వేసింది. అందవెల్లి-ఈసుగాం వెళ్లే మార్గంలోని కల్వర్టు కూలిపోయింది. భట్టుపల్లి-కాగజ్‌నగర్ మార్గం గుంతలమయం అయింది.

చింతలమానేపల్లి/ కౌటాల/లింగాపూర్/ బెజ్జూరు/దహెగాం/ వాంకిడి/ సిర్పూర్ (యు)/పెంచికలపేట: వర్షాలకు దిందా గ్రామం జలదిగ్బంధంలో ఉంది. బాబాసాగర్, నాయకపుగూడ ప్రజలకు వాగుఉధృతి కారణంగా రెండురోజులుగా రాకపోకలు నిలి చిపోయాయి. గూడెం-శివపల్లి గ్రామాల మధ్యఉన్న వాగులో నీటి మట్టం ఎక్కువగా ఉండడంతో వాగు దాటేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గూడెం ప్రాణహితనది జలకళ సంతరించుకుంది. ప్రాణహిత నిండుకుండలామారింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో తుమ్మిడిహెట్టి సంగమం వద్ద ప్రాణహిత పరవళ్లు తొక్కుతోంది. కాగా నది పరివాహక ప్రాంతాలైన వీరవెల్లి, సాండ్‌గాం, పార్డి, తాట్‌పల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామస్థులు అప్ర మత్తంగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్లవద్దని పోలీసు సిబ్బంది హెచ్చరిస్తున్నారు. లింగాపూర్‌మండలంలోని కిమానాయక్ తండా, మోతి పటార్, లొద్దిగూడా, పిట్టగూడా, ఘూమ్‌నూర్, వాగులు ఉప్పొంగడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. బెజ్జూరు మండలంలో సోమిని, కుశ్నపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు పొంగి ప్రవహిస్తున్నా యి. వాంకిడి మండలంలోని చిక్లివాగు, లంజన్‌వీర, కనర్గాం వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతోరాకపోకలు స్తంభించాయి. దహెగాం మండలంలోని పెద్దవాగు పరివాహక గ్రామాల ప్రజలకు ఎస్సై రాజు హెచ్చరికలు జారీచేశారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా పశువుల కాపర్లు, ప్రజలు ఎవరు కూడా వాగు దాటేప్రయత్నం చేయరాదన్నారు. దహెగాం మండలంలోని ఇట్యాల, అయినం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో సాగుచేసిన పత్తిపంట నీట మునిగింది. ఐనం గ్రామసమీపంలోని లోలెవల్ వంతెనను ఎంపీడీవో రాజేందర్ పరిశీలించారు. కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బురద నీటి గుంతలో ఇక్కట్లు తప్పడం లేదు. గుంతలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంపై నుంచి దాటుతూ పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. పెంచికలపేట మండలంలోని పెద్దవాగు, ఉచ్చమల్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. బొంబాయిగూడ గ్రామంలోని గోగు అంకుబాయి ఇల్లు కూలిపోయింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంటిని ఎంపీడీవో ఆల్బర్ట్‌సందర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. పలుగ్రామాల్లో పంటలునీట మునిగాయి.

ఉధృతంగా పెన్‌గంగా


సిర్పూర్(టి): సిర్పూర్(టి) సరిహద్దులోని పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో శనివారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై పోడ్గా పెన్‌గంగా నది వంతెన వద్ద పరిస్థితులను పరిశీలించారు. పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరివాహక గ్రామాలైన టోంకిని, పారిగాం, లక్ష్మీపూర్, వెంకట్రావుపేట గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. వాగులు, వంకలు దాటేందకు ప్రయత్నించవద్దన్నారు. ఏదైనా అత్యవసర సమయాల్లో అధికారులకు సమా చారం అందిస్తే సహకరిస్తామన్నారు. సిర్పూర్(టి)-చీలపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన తెగిపోవడంతో చీలపల్లి, రావణపల్లి, తదితర గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచి పోయాయి. ద్విచక్ర వాహనదారులు అతికష్టం మీద వాగు దాటుతున్నారు.



పెంచికలపేటలో కూలి పోయిన ఇల్లు



వాంకిడిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కుమరంభీంప్రాజెక్టు మూడు గేట్ల ఎత్తివేత



చింతలమానేపల్లిలో లో లెవల్‌వంతెన పై నుంచి దిందా వాగు ప్రవాహం



కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత పరవళ్లు



సిర్పూర్(టి) వద్ద పెన్‌గంగా పరిస్థితి పరిశీలిస్తున్న అధికారులు



సిర్పూర్(టి) మండలంలో కొట్టుకుపోయిన చీలపల్లి వంతెన



కెరమెరిలో మోడి వాగు ఉధృతిని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఎంపీడీఓ



లింగాపూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న కీమ్యా నాయక్ తండా వాగు



సివిల్స్‌లో తెలంగాణ సత్తా చాటాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' ఆశావహులకు చేయూత
- సింగరేణి సహకారంతో పథకం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

శ్రీరాంపూర్, జూలై 20: సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సింగరేణి సహకారంతో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల్లో అర్హులకు లక్ష రూపాయల వంతున ఆర్థిక సహాయం అందించే పథకాన్ని ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. తెలంగాణకు చెందిన 2023 సివిల్స్ విజేతలు, 2024మెయిన్స్ రాసే అభ్యర్థులను ఉద్దేశించి ఆయనమాట్లాడారు. తెలంగాణ యువతలో అమోఘమైన ప్రతిభ దాగి ఉందన్నారు. అందుకే సివిల్స్‌ప్రిపేర్ అవుతున్న వారికి తాము "రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం" కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ, తాను సివిల్స్ ప్రిపేర్ అయ్యే సమయంలో రూ.2వేలు లభించక ఇబ్బందులు పడ్డానని, రూ.50వేలు విలువైన పుస్తకం కొనుగోలుకు వారం రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇలాంటి ఇబ్బందులను దూరంచేసి తెలంగాణ నుంచి ఎక్కువ మందిని సివిల్స్‌లో విజయం సాధించేలా తాము సింగరేణి పక్షాన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాలకు కేబుల్స్ కట్టొద్దు

శ్రీరాంపూర్, జూలై 20: శ్రీరాంపూర్‌ఏరియా సింగరేణికిచెందిన కాలనీలు, గనుల ప్రాంతంలో, కంపెనీ క్వార్టర్లు, గనులకు విద్యుత్‌సరఫరా చేసేందుకు వేసిన విద్యుత్ స్తంభాలకు డిష్, ఇంటర్నెట్, ఇతర తీగలు కట్టరాదని జీఎం బి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాటికి తాముఅనుమతివ్వలేదని, నిబంధనను అతిక్రమించి, ప్రైవేటువ్యక్తులు, సంస్థలు వైర్లు కడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రైవేటువ్యక్తులుపనులు చేసే సమయంలో జరిగే ప్రమాదాలకు సింగరేణి ఎలాంటి బాధ్యత తీసుకోదని ఆయన తెలిపారు.

వరద పరిస్థితుల దృష్ట్యా ప్రత్యేక రక్షణ చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 20: వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ డీవీ శ్రీఇనవాసరావుతో కలిసి జిల్లాలోని తుంపల్లి వాగును సందర్శించారు. గ్రామాల్లో వరద పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదులు, కల్వర్టులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వరదల కారణంగా రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడే గ్రామాల్లో గర్భిణులను గుర్తించి సమీప పీహెచ్‌సీలలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సహాయార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. వరద పరిస్థితులలో సహాయంకోసం ఫోన్ నెం08733-279033, 6304686505ను సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లోకేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస రావు, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలోని 30వార్డుల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం సెల్‌నెంబరు 8712803804కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. తమ సిబ్బంది అందుబాటులో ఉండి సహాయం చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.



గుడెఘాట్ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూలై 20: భారీవర్షాల నేపథ్యంలో జిల్లాప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలసంక్షేమంకోసం పోలీసుశాఖ ఎళ్లవేళలా అదుబాటులో ఉంటుందని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రానున్న మూడురోజులు భారీ నుంచి అతిభారీవర్షాలున్న నేపథ్యంలో ప్రజలకు అనవసరంగా బయటికి రాకూడదన్నారు. వాగులు, వంకలు, నదులవైపు ఎవరుకూడా వెళ్లవద్దన్నారు. రైతులుపొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ స్తంభాలను, వైర్లను చేతులతో తాకరాదన్నారు. ప్రాణహిత పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు, యవకులు నది, జలాశయాల వద్ద సెల్ఫీలు, తీసుకోవడం, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఎవరైనా ప్రమాదంలో చిక్కు కుంటే వెంటనే 100కు లేదా దగ్గర్లోని పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి డిజాస్టర్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితి ఏర్పడితే పోలీసులను సంప్రదించాలన్నారు.

మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



యూనిట్ల మంజూరు పత్రం అందజేస్తున్న అదనపుకలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 20: ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా క్యాంటీన్‌లతోపాటు స్త్రీనిధి లింకేజ్, బ్యాంకులింకేజ్, వాటర్ షెడ్‌ల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థకంగా ఎదిగేందుకు రుణసదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపుజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ,తహసీల్దార్ తిరుపతి, ఏపీఎం సుజాత, శ్రీనివాస్, ఎంపీవో శివకుమార్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను ఆసుపత్రిలో ముందే చేర్చుకోవాలి

జైనూర్: వర్షాలు పడుతున్నందున గర్భిణులను ముందే ఆసుపత్రిలో చేర్చుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి కోరారు. స్థానిక 30పడకల ఆసుపత్రిని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షల గదిని పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి స్వయం సహాయ సంఘాలతో సమావేశ అయ్యారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వాలంబన చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణాలను పంపిణీ చేశారు. గణేష్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, డీసీహెచ్ చెన్నకేశవ్, వైద్యాధికారి అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ దిలీప్, సీడీపీవో ఇందిర, సూపర్ వైజర్ పింటుబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనలను పరిశీలించిన అదనపు కలెక్టర్

కెరమెరి: మండలంలోని సాంగ్వి కేలి(బి) గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనను శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న ప్రతిసారి ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. అందుకుగాను రెవెన్యూపంచాయతీ, పోలీసు సిబ్బంది కాపలాఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోకు సూచించారు. అయనవెంట డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో అంజద్‌పాషా ఉన్నారు. అలాగే అనార్‌పల్లి, మెట్టపిప్పిరి, తదితర గ్రామాల వాగులను సందర్శించారు.



జైనూరు ఆసుపత్రిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి